ట్రామాకేర్ సెంటర్లపై అధ్యయనం

తమిళనాడు వెళ్లిన వైద్యాధికారుల బృందం

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ట్రామాకేర్ వ్యవస్థను బలోపేతం చేయడంపై వైద్యారోగ్య శాఖ దృష్టి సారించింది. ఈ మేరకు తమిళనాడులో అమలవుతున్న ట్రామాకేర్ వ్యవస్థను అధ్యయనం చేసేందుకు వైద్యాధికారుల బృందాన్ని అక్కడికి పంపింది. టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ సహదేవ్ తదితరుల బృందం రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం చెన్నైకి వెళ్లింది. వారికి తమిళనాడు హెల్త్ సిస్టమ్స్ ప్రాజెక్ట్(టీఎన్‌హెచ్‌ఎస్‌పీ) అధికారులు స్వాగతం పలికారు. అక్కడ అమలవుతున్న వైద్య విధానాన్ని వివరించారు. రోడ్డు ప్రమాదాలు, గుండెపోట్లు, ఆత్మహత్యాయత్నాలపై అక్కడి దవాఖానల్లో అందిస్తున్న చికిత్సల గురించి తెలుసుకున్నారు.

మూలనపడ్డ '104' వాహనాలు

కాంగ్రెస్ సర్కారు ప్రజారోగ్యాన్ని విస్మరిస్తున్నది. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలందించేందుకు ప్రారంభించిన '104'పై పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో సమయానుకూలంగా ఈ సంచార వాహనాల ద్వారా గ్రామాల్లో రోగులకు వైద్యసేవలందించి మందులు ఇచ్చేవారు. సిద్దిపేట కలెక్టరేట్ వెనుక భాగంలో 8 వరకు 104 వాహనాలు మూలనపడి ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్నాయి. –నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దిపేట

జడ్పీ స్పెషల్ ఆఫీసర్లుగా కలెక్టర్లు

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ) : జడ్పీ చైర్మన్ల పదవీకాలం ముగియడంతో జిల్లా పరిషత్‌లకు కలెక్టర్లను స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తూ గురువారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా గురువారం ఆదేశాలు జారీ చేశారు. స్పెషల్ ఆఫీసర్లుగా ఆరు నెలలు లేదా ఎన్నికలు నిర్వహించే వరకు వీరు కొనసాగుతారు. పదవీ కాలం ముగియని ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం జిల్లా పరిషత్ మినహా మిగిలిన జిల్లాలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు.

బీసీల రిజర్వేషన్ 50 శాతానికి పెంచాలి

కేంద్రమంత్రికి ఆర్ కృష్ణయ్య వినతి

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ) : పంచాయతీరాజ్, స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌ను 50 శాతానికి పెంచాలని, ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం రిజర్వేషన్ల అంశంపై చర్చించారు. ఆయన వెంట బీసీ నాయకులు నీలం వెంకటేశ్, భూపేశ్‌సాగర్, అర్జున్‌సింగ్, రాజ్‌కుమార్ ఉన్నారు.

నకిలీ ఔషధ కేంద్రం సీజ్

కుత్బుల్లాపూర్, జూలై 4: నకిలీ ఔషధ తయారీ ముఠా గుట్టును పోలీసులు రట్టుచేశారు. ములుగు జిల్లాకు చెందిన గోపాల్ కొన్నేండ్ల కిందట నగరానికి వచ్చి నిజాంపేట్‌లో నివసిస్తున్నాడు. తాను స్థాపించిన ప్లాస్టిక్ మోల్డింగ్ కంపెనీ నష్టాల్లో కూరుకుపోవడంతో తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు సంపాదించే మార్గం కోసం వెతికసాగాడు. ఈ క్రమంలో ఢిల్లీకి చెందిన నిహాల్ పరిచయమయ్యాడు. తాను ఔషధాల తయారీకి అవసరమైన ముడిసరుకును పంపిస్తానని, ఔషధాలు తయారు చేసి తనకు పంపాలని గోపాల్‌కు చెప్పాడు. దీంతో గోపాల్ నకిలీ మందుల తయారీని ప్రారంభించాడు. సమాచారం తెలిసిన పోలీసులు దాడులు చేపట్టి దాదాపు 50 లక్షల విలువైన మందులు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

డ్రగ్స్ వైపు యువతను ప్రోత్సహిస్తే చర్యలు

పబ్ యజమానులకు డీజీపీ హెచ్చరిక

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ) : పబ్‌లు, బార్లు, రెస్టారెంట్ల యజమానులు డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వైపు యువతను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ రవిగుప్తా ఎక్స్ వేదికగా హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించవద్దని సూచించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే నూతన క్రిమినల్ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. రాష్ట్రం నుంచి మాదకద్రవ్యాలను పారదోలేందుకు ప్రభుత్వం, పోలీసులు కృతనిశ్చయంతో ఉన్నట్టు తెలిపారు.

గురుకుల విద్యార్థులు రోబోలా?

- **600 మంది 15 నిమిషాల్లో కాలకృత్యాలు తీర్చుకోగలరా ?**
- **6 గంటలపాటు ఏకబిగిన పాఠాలు వినగలరా?**
- **కామన్ టైంటేబుల్‌పై గురుకుల సిబ్బంది నిప్పులు**
- **పనివేళల మార్పు జీవోను ఉపసంహరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాల డిమాండ్**

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ గురుకుల సొసైటీలన్నింటికీ ఒకే విధమైన పనివేళలను ఖరారు చేయడాన్ని ఆయా సొసైటీల్లోని ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలు ముక్తకంఠంతో నిరసిస్తున్నాయి. క్షేత్రస్థాయి పరిస్థితులను పట్టించుకోకుండా, కనీసం మాటమాత్రమైన చర్చించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా ఉత్తర్వులు జారీ చేయడంపై సంఘాలు భగ్గుమంటున్నాయి. కామన్ టైంటేబుల్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటివరకు ఆయా సొసైటీల్లో పనివేళలు, రోజువారీ సమయపాలన పట్టికలు దేనికవే అన్నట్టుగా ఉన్నాయి. తాజాగా అన్ని గురుకులాలకు కామన్ టైంటేబుల్‌ను నిర్ణయిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని సొసైటీలు 8గంటల నుంచి ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయసంఘాలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నాయి.

ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రశ్నలు..

- ఉదయం 5గంటలకు గురుకుల విద్యార్థులను నిద్రలేపితే, కాలకృత్యాలు, వ్యాయామం పూర్తిచేసుకుని 7గంటల వరకు బ్రేక్‌ఫాస్ట్ రెడీ కావడం చూసేందుకు బాగుంది. కానీ అది ఆచరణ సాధ్యం కాదు. కారణం ఇప్పుడు దాదాపు 600మందితో నడుస్తున్న గురుకులాలు 70శాతం ప్రైవేటు భవనాల్లోనే ఉన్నాయని, అందులో బాత్‌రూములు, నీరు, వంట గది తదితర వసతులు విద్యార్థుల సంఖ్యకు సరిపడా లేవని తెలిపారు. బ్రేక్‌ఫాస్ట్ రెడీ అయ్యే వరకు విద్యార్థులను పరగడుపున తరగతిగదిలో కూర్చోబెట్టాల్సి వస్తున్నదని, క్లాస్ మధ్యలో బ్రేక్ ఫాస్ట్‌కి పంపాల్సి పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం చేసిన ఈ గంట సవరణ ఫలితం శూన్యం.
- ఉ. 8.15 నుంచి 11.15 గంటల మధ్యలో 45 నిమిషాల చొప్పున వరుసగా నాలుగు పీరియడ్స్‌ను విద్యార్థులు వినాల్సి ఉంటుంది. ఒకసారి తరగతిగదిలో కూర్చున్న విద్యార్థి ఏకంగా 3 గంటలు కూర్చోవాలి. చాలా గురుకులాల్లో బెంచీలులేక ఇంటర్ విద్యార్థులూ కిందే కూర్చుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం1:25 వరకు 7 పీరియడ్స్ ఉంటే, ఎలా ఒక స్టూడెంట్ భరించగలడు?
- 5, 6, 7 విద్యార్థులకు భోజన సమయం 12.45 గంటల నుంచి 1.30గంటల వరకు అంటే దాదాపు 45నిమిషాలు మాత్రమే లంచ్ టైమ్. అదే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్లాసులు ప్రారంభమైనప్పటి నుంచి స్కూల్ ముగిసే వరకూ యూరినల్ టైమ్స్‌కి గంటన్నర, మూడున్నర గంటల గ్యాప్‌లో లంచ్, ఆ తర్వాత గంట న్నర గ్యాప్‌లో షార్ట్ బ్రేక్ ఉన్నాయి. గురుకుల విద్యార్థులు రోబోలా? విద్యార్థుల శారీరక ధర్మాలు ఒకటే అనే విషయం మరిచిరా?
- సాయంత్రం గేమ్స్ తర్వాత విద్యార్థులకు పర్సనల్ టైమ్ 15 నిమిషాలు మాత్రమే. దాదాపు 600 మంది విద్యార్థులు ఉన్న గురుకులాల్లో 15 నిమిషాల్లో ఈ టాస్క్ పూర్తి చేసుకోవడం ఎలా సాధ్యం?
- మార్చిన పనివేళలు గురుకుల సిబ్బంది మానసికస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతాయని, అంతిమంగా అది విద్యార్థులపైనే పడుతుందనే విషయాన్ని ప్రభుత్వం ఎలా మరిచిపోయింది..?
- గురుకులాల్లో క్వార్టర్స్ లేవు. పిల్లలకే నిద్రపోవడానికి రూములు చాలని దుస్థితి. ఉద్యోగులు, సిబ్బంది గురుకులాల్లోనే ఉండాలనే నిబంధన ఎలా సాధ్యమవుతుందో ప్రభుత్వమే చెప్పాలి..?
- రోడ్డు ప్రయాణం చేయడానికి వీలుగా గురుకుల పాఠశాలలు లేవు. రాత్రివేళలో మహిళా ఉపాధ్యాయులు తమ విధులు నిర్వర్తించడం ఎలా సాధ్యమవుతుంది?
- జనరల్ స్కూల్‌టీచర్ ఒక రోజులో చేస్తున్న పనిని గురుకుల టీచర్‌తో 1/2రోజులో చేయిస్తున్నారు? ఇంకా ఆ టీచర్ స్టడీ అవర్స్‌ని ఎలా సమర్థవంతంగా నిర్వహిస్తాడు ?

ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

అన్ని గురుకులాలకు కలిపి ఒకే విధమైన పనివేళలను నిర్ణయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తూ తెలంగాణ గవర్నమెంట్ ఆల్ రెసిడెన్షియల్స్ ఇన్‌స్టిట్యూట్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టిగారియా) అధ్యక్షుడు మామిడి నారాయణ, జనరల్ సెక్రటరీ మధుసూదన్, తెలంగాణ గురుకుల స్టాఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభుదాస్, ట్రైబల్ వెల్ఫేర్ సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షుడు రుషికేష్, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం (టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ) అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి దయాకర్, టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జంగయ్య, చావ రవి వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశా రు. ప్రభుత్వం నిర్ణయించిన పనివేళల్లో హేతుబద్ధత, శాస్త్రీయత లేదని, ఎంతమాత్రం ఆమోదయోగ్యనీయంకాదని వ్యతిరేకించారు. ప్రభు త్వ నిర్ణయం గురుకుల ఉపాధ్యాయులపై దాడి గా అభివర్ణించారు. 33వేల మంది గురుకుల ఉపాధ్యాయుల చేతిలో లక్షల మంది పేద విద్యార్థుల భవితవ్యముందని, తాజా షెడ్యూల్‌ను అమలు చేస్తే అది విద్యార్థులకే తీరని నష్టమని హెచ్చరించారు. వెంటనే పనివేళల షెడ్యూల్‌ను ఉపసంహరించుకోవాలని ఆయా సంఘాలు డిమాండ్ చేశాయి.

'సర్వీస్‌రూల్స్‌ను మార్చండి'

గురుకులాల పనివేళల మార్పుపై దృష్టిసారించిన ప్రభుత్వం అదే సమయంలో ఆయా గురుకులాల్లో ఉన్న సర్వీస్‌రూల్స్ మార్పుపైనా దృష్టిపెట్టాలని తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ (టీజీపీఏ) అధ్యక్షుడు అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పనివేళల మార్పుతో గురుకుల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పెద్దగా ఒరిగేదేమీ లేదని వివరించారు. కానీ ఒక్కో గురుకులానికి సంబంధించి ఒక్కో విధమైన సిబ్బంది సర్వీస్ రూల్స్ ఉన్నాయని గుర్తుచేశారు. రాష్ట్రంలోని 5 గురుకుల సొసైటీల్లోని ఉద్యోగ, ఉపాధ్యాయులను ఒకే రిక్రూట్‌మెంట్ విధానం ద్వారా భర్తీ అవుతున్నా విభిన్నమైన సర్వీస్‌రూల్స్ వల్ల వారు బదిలీలు, ప్రమోషన్లలో తద్వారా జీతభత్యాల్లో తీవ్ర వ్యత్యాసముంటుందని వివరించారు. ప్రస్తుతం బదిలీలు, ప్రమోషన్లు చేపడుతున్న నేపథ్యంలో వెంటనే సర్వీస్‌రూల్స్‌ను కూడా మార్చాలని టీజీపీఏ అధ్యక్షుడు అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు.

ఆర్ఆర్ఆర్ మొత్తం ఎన్‌హెచ్ 161ఏఏ

6న ఢిల్లీలో కీలక సమావేశం

హైదరాబాద్, జూలై 4(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి కేటాయించిన ఎన్‌హెచ్ నంబరే దక్షిణ భాగానికీ వర్తిస్తుందని జాతీయ రహదారుల అథారిటీ స్పష్టం చేసినట్టు అధికారవర్గాలు తెలిపాయి. దీంతో మొత్తం ఆర్ఆర్ఆర్‌ను ఎన్‌హెచ్–161ఏఏగా పిలవనున్నారు. దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉన్నది. ట్రిపుల్‌ఆర్‌ను ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించిన విషయం తెలిసిందే. ఇందులో ఉత్తర భాగం 164 కిలోమీటర్లకు జాతీయ రహదారుల సంస్థ 2017 జూన్‌లో ఎన్‌హెచ్–161ఏఏ నంబర్‌ను కేటాయించింది. దక్షిణ భాగం రోడ్డు నిర్మాణానికి ఇటీవలే కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదం తెలపగా, అలైన్‌మెంట్‌కు ఆమోదం తెలపాల్సి ఉన్నది. జాతీయ రహదారుల విషయంలో నంబర్ కేటాయించటమే అత్యంత కీలకమని, నంబర్ కేటాయిస్తే ప్రాజెక్టు పనులు పుంజుకుంటాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి భేటీ అనంతరం ఎన్‌హెచ్ నంబర్‌పై ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. మరోవైపు, ఈనెల 6న ఢిల్లీలో ఫైనాన్స్ స్టీరింగ్ కమిటీ సమావేశం జరగనున్నది. రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై ప్రతిపాదనలు సమర్పిస్తారు. ఇందులో ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగానికి తుది అనుమతులు సహా 16 రాష్ట్ర రోడ్ల అప్‌గ్రేడేషన్ ప్రతిపాదనలు సమర్పించనున్నట్టు సమాచారం.

ఫోన్ల ట్యాపింగ్ కేసులో... పీటీ వారెంట్‌పై రాధాకిషన్‌రావు అరెస్టు

నాంపల్లి కోర్టులు, జూలై 4 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అదే పోలీసుస్టేషన్‌లో నమోదైన కిడ్నాప్, బెదిరింపు కేసులో ప్రొడక్షన్ వారెంట్ (పీటీ)పై అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించడంతో నిందితుడిని తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించారు. తనను కిడ్నాప్ చేసి, నిర్బంధించి, బెదిరింపులకు గురిచేసి షేర్లు బదలాయించుకున్నారంటూ బాధితుడు చెన్నుపాటి వేణుగోపాల్ ఫిర్యాదుమేరకు మొత్తం తొమ్మిది మందిపై 386,365, 341, 120బీ రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు.

టీఎన్జీవో మాజీ మహిళా నేత రంజన కన్నుమూత

హైదరాబాద్, జూలై 4(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన టీఎన్జీవో మాజీ మహిళా నేత రంజన (70) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. ఉద్యోగుల పెన్‌డౌన్, సకల జనుల సమ్మెతోపాటు అనేక ఉద్యమాల్లో మహిళా ఉద్యోగులను సంఘటితం చేయడంలో రంజన ప్రధాన భూమిక పోషించారు. ఆమె మృతికి స్వామి గౌడ్, దేవీప్రసాద్ సంతాపం ప్రకటించారు. జాంబాగ్‌లోని ఆమె నివాసంలో మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

వాణిజ్య

స్టాక్ బ్రోకింగ్ మోసాలపై సెబీ నజర్

సంస్థాగత యంత్రాంగాన్ని తప్పనిసరి చేస్తూ సర్క్యులర్



న్యూఢిల్లీ, జూలై 4: సెక్యూరిటీస్ మార్కెట్‌లో మదుపరుల ప్రయోజనాల రక్షణార్థం మోసాలను కనిపెట్టి, అరికట్టేందుకు స్టాక్ బ్రోకర్లకు ఓ సంస్థాగత యంత్రాంగాన్ని తప్పనిసరి చేస్తూ మార్కెట్ రెగ్యులేటర్ సెబీ గురువారం ఓ సర్క్యులర్‌ను విడుదల చేసింది. సవరించిన సెబీ స్టాక్ బ్రోకర్ల రెగ్యులేషన్స్–2024లో భాగంగా ట్రేడింగ్, అంతర్గత కార్యకలాపాల పర్యవేక్షణకు నిఘా వ్యవస్థ, విజిల్–బ్లోయర్ విధానాన్ని పరిచయం చేయడం వంటి సూచనలను ఈ సర్క్యులర్‌లో మార్కెట్ రెగ్యులేటర్ చేసింది. మార్కెట్ సమగ్రత, మదుపరుల ప్రయోజనాల రక్షణే ధ్యేయంగా ఈ రెగ్యులేషన్స్‌ను సవరించిన విషయం తెలిసిందే. కాగా, బ్రోకర్స్ ఇండస్ట్రీ స్టాండర్డ్స్ ఫోరం (ఐఎస్ఎఫ్) కార్యాచరణ పద్ధతులను అనుసరించే ఈ సూచనలు చేసినట్టు సెబీ ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఇక 50వేలకుపైగా యాక్టివ్ యూనిక్ క్లయింట్ కోడ్స్ (యూసీసీ) ఉన్న బ్రోకర్లు 2025 జనవరి 1కల్లా సెబీ తాజా నిబంధనలను అమల్లోకి తీసుకురావాలి. 2వేలలోపు యూసీసీలున్న బ్రోకర్లు 2026 ఏప్రిల్ 1కల్లా.. 2001 నుంచి 50వేలదాకా యూసీసీలున్న బ్రోకర్లు 2025 ఏప్రిల్ 1కల్లా సెబీ నిబంధనల్ని ఆచరణలో పెట్టాల్సి ఉన్నది. అలాగే క్వాలిఫైడ్ స్టాక్ బ్రోకర్లు ఈ ఏడాది ఆగస్టు 1కల్లా ఈ సర్క్యులర్‌ను అమలు చేయాల్సి ఉంటుంది. ఈ సర్క్యులర్ వివరాలను స్టాక్ ఎక్స్చేంజీలు సైతం తమతమ వెబ్‌సైట్లలో సెబీ పెట్టాలన్నది.

మళ్లీ 73 వేలు దాటిన పుత్తడి

రూ.530 పెరిగిన తులం ధర

న్యూఢిల్లీ, జూలై 4: గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లో అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో ధరలు భారీగా పుంజుకున్నాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పుత్తడి ధర మళ్లీ రూ.73 వేల మార్క్‌ను అధిగమించింది. తులం ధర రూ.530 అధికమై రూ.73,080కి చేరుకున్నది. అంతకుముందు ధర రూ.72,550గా ఉన్నది. పసిడితోపాటు వెండి పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.1,200 అధికమై రూ.92,500 పలికింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.710 పుంజుకొని రూ.73,090కి చేరుకోగా, 22 క్యారెట్ ధర రూ.650 అధికమై రూ.67 వేలుగా నమోదైంది. అలాగే రూ.1,500 అధికమైన కిలో వెండి రూ.96 వేల నుంచి రూ.97,500కి ఎగబాకింది. అంతర్జాతీయ స్పాట్ గోల్డ్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర ఒకేరోజు 16 డాలర్లు పెరిగి 2,355 డాలర్లకు చేరుకోవడం వల్లనే దేశీయంగా ధరలు పుంజుకున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. అలాగే వెండి కూడా 29.80 డాలర్ల నుంచి 30.25 డాలర్లకు ఎగబాకింది. ఫెడరల్ రిజర్వు మరోసారి వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలున్నాయంటూ వచ్చిన అంచనాలు బంగారం పెరగడానికి ప్రధాన కారణమన్నారు.

ఈఈఎస్ఎల్‌తో హైదరాబాదీ వ్యాపారి

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఇంధన సామర్థ్య పరిష్కారాలను పెంపొందించడానికి ప్రభుత్వరంగ సంస్థ ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)తో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మహిళా వ్యాపారవేత్త వద్య పద్మ ఒప్పందం కుదుర్చుకున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, మెరుగైన ఆర్థిక వృద్ధి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు మద్దతుగా నిలవడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నారు. ఈ ఎంవోయూతో రిటైల్ స్టోర్లను స్థాపించడం ద్వారా రాష్ట్ర ప్రజలకు సమర్థమైన ఇంధన సాంకేతికలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలో భారీ ఎత్తున రిటైల్‌స్టోర్లను విస్తరించాలని ఈఈఎస్ఎల్ లక్ష్యంగా పెట్టుకున్నది.

సిగ్నిటీలో కోఫోర్జ్‌కి వాటా

న్యూఢిల్లీ, జూలై 4:హైదరాబాద్‌కు చెందిన ఐటీ సేవల సంస్థ సిగ్నిటీ టెక్నాలజీలో 11 శాతం వాటాను చేజిక్కించుకున్నది డిజిటల్ సేవలు అందిస్తున్న కోఫోర్జ్. బహిరంగ మార్కెట్లో ఒక్కో షేరుకు రూ.1,412.25 చొప్పున 30,21,293 షేర్లను కొనుగోలు చేయడానికి రూ.426.68 కోట్ల నిధులను వెచ్చించింది.

బుల్ రన్.. తగ్గేదేలే!

లక్ష పాయింట్లకు సెన్సెక్స్ • వచ్చే ఏడాది డిసెంబర్‌కల్లా సాధ్యమేనన్న అంచనాలు

ముంబై, జూలై 4: బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్.. వచ్చే ఏడాది డిసెంబర్‌కల్లా లక్ష పాయింట్ల మార్కును చేరుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. 1979 ఏప్రిల్ 1న బేస్ వాల్యూ 100 పాయింట్లతో సెన్సెక్స్ మొదలైంది. ఈ క్రమంలో గురువారం తొలిసారి 80,000 పాయింట్ల ఎగువన ముగిసింది. దీంతో గడిచిన 45 ఏండ్ల కాలంలో వార్షిక చక్ర వృద్ధిరేటు (సీఏజీఆర్) 15.9 శాతంగా ఉన్నది. ఈ వ్యవధిలో సూచీ ఏకంగా 800 రెట్లు ఎగబాకడం గమనార్హం. మరో ఏడాదిన్నరలో 20,000 పాయింట్లు ఎగిసి లక్ష పాయింట్లను తాకుతుందని చెప్తున్నారు.

ఐదేండ్లలో 40 వేల పాయింట్లు

గడిచిన ఐదేండ్లలో సెన్సెక్స్ 40,000 పాయింట్లు పెరిగింది. కేవలం 3 నెలల్లోనే 5,000 పాయింట్లు పుంజుకోవడం విశేషం. కాగా, ప్రతీ ఐదేండ్లకు సెన్సెక్స్ రెట్టింపు స్థాయిలో పాయింట్లను పెంచుకుంటూపోతున్నదని దలాల్ స్ట్రీట్ సీనియర్, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సహ వ్యవస్థాపకుడు రాందేవ్ అగర్వాల్ అంటున్నారు. ఈ క్రమంలోనే 2029–30 నాటికి సెన్సెక్స్ 1,50,000 పాయింట్లకు చేరుకోవచ్చని ఆయన అంచనా వేస్తున్నారు. 'భారతీయ కార్పొరేట్ రంగం లాభాలు గత మూడు దశాబ్దాలకుపైగా కాలంలో సుమారు 17 శాతం చక్ర వృద్ధిని సాధించాయి. ఒకవేళ ప్రస్తుత ప్రైస్–టు–ఎర్నింగ్స్ లెవల్స్ 25 రెట్లు ఇలాగే కొనసాగితే సెన్సెక్స్ చక్ర వృద్ధిని 15 శాతంగా భావించవచ్చు. అంటే ప్రతీ ఐదేండ్లకు రెట్టింపు అవుతుందన్నమాట' అని అన్నారు. ప్రముఖ మార్కెట్ మదుపరి మార్క్ మోబియస్ స్పందిస్తూ.. భారత జీడీపీ 7 శాతంతో, కంపెనీలు 14–15 శాతం వృద్ధితో పయనిస్తే.. సెన్సెక్స్ కూడా వచ్చే 10 ఏండ్లలో ఇదే జోష్‌తో పరుగులు పెట్టగలదన్నారు.

80 వేలపైన తొలిసారి..

బీఎస్ఈ సెన్సెక్స్ తొలిసారి 80,000 మార్కుకు ఎగువన ముగిసింది. గురువారం 62.87 పాయింట్లు పెరిగి మునుపెన్నడూ లేని విధంగా 80,049.67 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 80,392.64 వద్దకు ఎగిసి ఇంట్రా–డే హై రికార్డునూ నెలకొల్పింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 15.65 పాయింట్లు అందుకుని మొదటిసారి 24,302.15 వద్ద నిలిచింది. ఇంట్రా–డేలో 24,401 పాయింట్లను తాకి సరికొత్త రికార్డు సృష్టించింది. ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా మోటార్స్, సన్ ఫార్మా, కొటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు మదుపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. రంగాలవారీగా హెల్త్‌కేర్, ఐటీ, టెక్నాలజీ, ఆటో, టెలికం సూచీలు పుంజుకున్నాయి.

45 ఏండ్లలో 800 రెట్లు ఎగిసిన సెన్సెక్స్

మరో ఏడాదిన్నరలో లక్ష పాయింట్లకు చేరవచ్చన్న అంచనాలు

వాస్తవం

సంవత్సరం	సెన్సెక్స్
ఏప్రిల్ 1979	100
జూలై 2024	80,000

వ్యవధి: 45 ఏండ్ల 3 నెలలు

చక్రవార్షిక వృద్ధిరేటు 15.9%

అంచనా

సంవత్సరం	సెన్సెక్స్
ఏప్రిల్ 1979	100
డిసెంబర్ 2025	1,00,000

వ్యవధి: 46 ఏండ్ల 8 నెలలు

బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ

మైలురాళ్లు	చేరిన సంవత్సరం	పట్టిన కాలం
రూ.100 లక్షల కోట్లు	మార్చి 2014	-
రూ.200 లక్షల కోట్లు	ఫిబ్రవరి 2021	6 ఏండ్ల 11 నెలలు
రూ.300 లక్షల కోట్లు	జూలై 2023	2 ఏండ్ల 5 నెలలు
రూ.400 లక్షల కోట్లు	ఏప్రిల్ 2024	9 నెలలు
రూ.447 లక్షల కోట్లు	జూలై 2024	3 నెలలు

రూ.447.30 లక్షల కోట్లకు..

బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ గతంలో ఎప్పుడూ లేనంతగా రూ.447.30 లక్షల కోట్లకు చేరుకున్నది. గురువారం మార్కెట్ ట్రేడింగ్ ముగిసే నాటికి రూ.4,47,30,452.99 కోట్ల (5.36 ట్రిలియన్ డాలర్లు)కు వెళ్లింది. ఈ ఒక్కరోజే రూ.2 లక్షల కోట్లు ఎగిసింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ 0.62 శాతం, 0.60 శాతం చొప్పున పెరిగాయి.

తగ్గిన సిమెంట్ ధర

బస్తాపై రూ.20 వరకు

హైదరాబాద్, జూలై 4: సిమెంట్ ధరలు తగ్గుముఖం పట్టాయి. వర్షాకాలం కావడంతో డిమాండ్ అంతకంతకు పడిపోవడంతో సిమెంట్ తయారీ సంస్థలు తమ ధరలను తగ్గించాయి. దీంతో రాష్ట్రంలో బస్తా సిమెంట్ ధర రూ.20 వరకు తగ్గించాయి. ప్రతియేటా వర్షాకాలంలో ధరలు తగ్గడం సహజమని డీలర్ వెల్లడించారు. ఒకవైపు వర్షాలు కురుస్తుండటం, మరోవైపు ప్రభుత్వానికి చెందిన ప్రాజెక్టులు నత్తనడకన సాగుతుండటం, రియల్ ఎస్టేట్ సంస్థలు తమ ప్రాజెక్టుల నిర్మాణాల్లో వేగాన్ని తగ్గించడం కూడా ఒక కారణమని పేర్కొన్నారు. మళ్లీ పండుగ సీజన్ నాటికి ధరలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పడటంతో నూతన ప్రాజెక్టుల నిర్మాణాలు ఇప్పుడిప్పుడే వేగం పుంజుకుంటున్నాయన్నారు. 50 కిలోల అల్ట్రాటెక్ సిమెంట్ బస్తా ధర రూ.310కి దిగిరాగా, బిర్లా రూ.290, చెట్టినాడు రూ.250గాను, ప్రియా బస్తా ధర రూ.245కి తగ్గాయి. మరోవైపు, స్టీల్ ధరలు కూడా భారీగా తగ్గాయి. టన్ను ధర రూ.6 వేలు తగ్గించాయి.

సిమెంట్ రంగంలో వృద్ధి అంతంతే

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సిమెంట్ రంగంలో వృద్ధి సింగిల్ డిజిట్ 2–3 శాతానికి పరిమితం కానున్నట్లు దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది. లోక్‌సభ ఎన్నికల కారణంగా నిర్మాణ రంగంలో మందకొడి పరిస్థితులు నెలకొనడం ఇందుకు కారణమని తెలిపింది. అయినప్పటికీ 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను సిమెంట్ రంగంలో వృద్ధి 7–8 శాతంగా ఉంటుందని అంచనాను వేస్తున్నది. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, గృహ రంగాల్లో సిమెంట్‌కు డిమాండ్ అధికంగా ఉండే అవకాశాలున్నాయని పేర్కొంది. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై) పథకం కింద మరిన్ని ఇళ్లు మంజూరు చేయనుండటం, పారిశ్రామిక సంస్థలు భారీగా పెట్టుబడులు పెడుతుండటం ఇందుకు కారణమని విశ్లేషించింది. దీంతో సిమెంట్ తయారీ సంస్థలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకునే పనిలో పడ్డాయి. ప్రస్తుతం సిమెంట్ రంగంలో ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ అగ్రస్థానంలో ఉండగా, అదానీ గ్రూపు సంస్థ అంబుజా సిమెంట్ కూడా రాణిస్తున్నది. మార్చి 2015లో 45 శాతంగా ఉన్న టాప్ ఐదు కంపెనీల మార్కెట్ వాటా మార్చి 2024 నాటికి 54 శాతానికి పెరిగింది. వచ్చే ఏడాది ఇది 60 శాతానికి చేరుకుంటుందని రేటింగ్ ఏజెన్సీ అంచనావేస్తున్నది. అలాగే సిమెంట్ కంపెనీ నిర్వహణ లాభాలు కూడా 1–3 శాతం వరకు పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపింది.



ఏజీఆర్‌లో జియో టాప్

న్యూఢిల్లీ, జూలై 4: రిలయన్స్ జియో అత్యధిక సర్దుబాటు స్థూల ఆదాయాన్ని (ఏజీఆర్) ప్రకటించింది. జనవరి–మార్చిలో రూ.25,330.97 కోట్లుగా ఉన్నది. గత ఏడాది ఇదే వ్యవధితో పోల్చితే 10.21 శాతం పుంజుకున్నది. నాడు రూ.22,985 కోట్లేనని గురువారం టెలికం రంగ రెగ్యులేటర్ ట్రాయ్ తెలియజేసింది. ఇక భారతీ ఎయిర్‌టెల్ ఏజీఆర్ 13.25 శాతం ఎగిసి రూ.20,951.91 కోట్లుగా నమోదైంది. నిరుడు రూ.15,500.36 కోట్లే. నష్టాల్లో ఉన్న వొడాఫోన్ ఐడియా ఏజీఆర్ సైతం రూ.7,210.63 కోట్ల నుంచి రూ.7,370.75 కోట్లకు పెరిగింది. అయితే ప్రభుత్వ రంగ టెలికం సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ ఏజీఆర్‌లు 4.41 శాతం, 13.78 శాతం చొప్పున తగ్గాయి. బీఎస్ఎన్ఎల్ ఏజీఆర్ ఈ జనవరి–మార్చిలో 1,991.61 కోట్లుగా ఉంటే, ఎంటీఎన్ఎల్‌ది రూ.156.61 కోట్లే.

రాజస్థాన్‌లో సింగరేణి సోలార్ ప్లాంట్!

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): సింగరేణి ఇతర విభాగాల్లో వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన సంస్థ..తాజాగా రాజస్థాన్‌లో మెగా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి కంపెనీ సీఎండీ బలరాం.. గురువారం ఆ రాష్ట్ర రాజధాని జైపూర్‌లో విద్యుత్ విభాగ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సింగరేణి ఆధ్వర్యంలో ప్లాంట్ ఏర్పాటుకు ముందుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని వారు భరోసా ఇచ్చారు. అనంతరం రాజస్థాన్ జెన్కో సీఎండీ దేవేంద్ర శ్రింగిని, రాజస్థాన్ రెన్యువబుల్ ఎనర్జీ కార్పొరేషన్ ఎండీ నథ్‌మల్ డైడెల్‌ను, రాజస్థాన్ డిస్కమ్స్ చైర్మన్ భానుప్రకాశ్‌తో ప్రత్యేకంగా ఆయన భేటీ అయ్యారు. ప్లాంట్ ఏర్పాటు, పూర్తయిన తర్వాత విద్యుత్తు కొనుగోలుకు సంబంధించి తదితర అంశాలపై వీరు ప్రధానంగా చర్చించారు. ఇప్పటికే 235 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్ ప్లాంట్లను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసి విజయవంతంగా నిర్వహిస్తున్నామని బలరాం ఈ సందర్భంగా చెప్పారు. వ్యాపార విస్తరణలో భాగంగా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్న యోచనతో ఉన్నట్టు తెలిపారు. ఇందులో భాగంగానే రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్తు ఉన్నతాధికారులను కలిసి ఆ రాష్ట్రంలోని సోలార్ పార్కులో మెగా ప్లాంట్ ఏర్పాటుకు గల అవకాశాలపై చర్చించినట్టు వివరించారు.